
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 । కనిష్ఠం 19.3
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఫిబ్రవరి 2024



నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 23: ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని రెంజల్, ఎడపల్లి, బోధన్ రూరల్ మండలాలలో నెలవారి మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. రెంజల్, దండి గుట్ట, నీలా, తాడ్‌బిలోలి, ఎడపల్లిలోని ఎడపల్లి, ఏఆర్పీ క్యాంప్, మండల్‌పాడ్, రాణాకలాన్, బోధన్ రూరల్ పరిధి లోని పెగడాపల్లి, కల్దుర్కి, చిన్నమావంది, ఎరాజ్‌పల్లి, ఊటిపల్లి, సంగం స బ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.



- సంఘాలకు అందని ధాన్యం కొనుగోలు కమీషన్
- కొనసాగుతున్న ఆ శాఖ ఉన్నతాధికారుల దర్యాప్తు
- కార్యాలయాల్లో పలు కీలక రికార్డులు మాయం
- పాత రిజిస్టర్లు స్వాధీనం చేయకపోవడంపై ఉన్నతాధికారులకు నివేదించిన డీసీవో
- కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఫిర్యాదుతో దర్యాప్తు వేగవంతం
- బ్యాంకు స్టేట్‌మెంట్ల ద్వారా వివరాలను తీసుకుంటున్న అధికారులు



సహకార సంఘాల
కమీషన్‌పై దర్యాప్తు!

నిజామాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్ర తినిధి): జిల్లాలో ధాన్యం కేటాయింపుల వ్యవహారం ప లు మలుపులు తిరుగుతోంది. ధాన్యం కొనుగోలులో వచ్చిన కమీషన్ సహకార సంఘాలకు అందించడం లో జాప్యం వ్యవహారంపై ఆ శాఖ ఉన్నత అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు. ధాన్యం కొనుగోలు, వచ్చిన కమీషన్‌పై ఆరా తీస్తున్నారు. ఏ సీజన్ కమీషన్ ఆ సీజన్‌లో ఆ సంఘాలకు ఎందుకు చెల్లించలేదనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారులకు వచ్చిన నివేదికల ఆధారంగా ప్రత్యేకాధి కారిని నియమించి చర్యలను చేపడుతున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగో లు కమిషన్ చెల్లింపులపై వచ్చిన అవకతవకలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు డీసీవోను బదిలీ చేసి కొత్త అధికా రిని నియమిం చారు. అప్పటి కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్‌లను ఇప్పటికీ ఆ అధికారి అందించకపోవడంపై కొత్తగా చేరిన డీసీవో ఉన్నతాధికారుల కు నివేదించడంతో లోతుగా దర్యాప్తును మొదలుపెట్టారు. కమీషన్ ని. దులు ఏంచేశారు.. ఎందుకు ఆలస్యంగా చెల్లించారో పరిశీలిస్తున్నారు. మరిన్ని చర్యలు చేపట్టేందుకు శాఖ తరపున సిద్ధమవుతున్నారు.

• సంఘాలకు అందని కొనుగోళ్ల కమీషన్

జిల్లాలో రైస్‌మిల్లర్లకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టడంపై ప్రభుత్వ ఆదేశాలతో దర్యాప్తు మొదలైంది. బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 11 మిల్లులపైన కేసులను నమోదు చేశారు. ఈ ధాన్యం కొనుగోళ్లన్నీ జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేశారు. ప్రతీ సీజన్ లో కొనుగోలు చేసిన ధాన్యానికి ఆ సంఘా లకు కమీషన్ చెల్లిస్తారు. పౌర సరఫరాల సంస్థ నుంచి కమీషన్ సహకార శాఖకు ఆ సీజన్‌లోనే పంపిస్తారు. వచ్చిన డబ్బులను ఆయా సంఘాలు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బట్టి కమీషన్‌ను సంఘాల అకౌంట్‌లో జమ చేస్తారు. కొన్నేళ్లుగా సీజన్‌లలో కొనుగోలు చేసిన ధాన్యానికి కమీషన్ మరో సీజన్ కొనుగోలు చేసేంత వరకు చెల్లించలేదు. కమీషన్ వచ్చిన సహకార శాఖ నుంచి విడుదల చేయలేదు. ఈ వ్యవహారంపై రాష్ట్ర కిసాన్ కాంగ్రె స్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రా వుతో పాటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లాకు చెందిన మరికొంతమంది సొసైటీ చైర్మన్ల నుంచి కూడా ఫిర్యాదు అందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగా జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలాన్ని బదిలీచేశారు. ఆయనస్థానంలో కొత్త అధికారి శ్రీనివాస్‌ను నియమించారు.

• రికార్డులు మాయం..

ఒక శాఖలో సంబంధిత అధికారి బదిలీపై వెళ్లినప్పుడు ఆ శాఖలో చేసిన పనులు, తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను తన స్థానంలో వచ్చిన కొత్త అధికారికి అప్పగించాలి. అయితే జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం బదిలీ తర్వాత 2018 నుంచి 2023 జూన్ వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన కమీషన్ రికార్డులను అప్పజెప్పలేదు. ఎవరెవరికి ఎన్ని చెక్కుల ద్వారా నిధులు చెల్లించారో వి వరాలను ఇవ్వలేదు. ఒక్క సీజన్‌కు సంబంధించిన వివరాలనే కొత్త అధికారికి అందించారు. సహకార శాఖ తరఫున కమీషన్ చెల్లింపుల వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు జాయింట్ రిజిస్ట్రార్ స్థాయి అధికా రిని నియమించారు. ఆ అధికారికి కూడా వివరాలను అందించలేదు. వివరాలు అందించేందుకు గడువు కోరడంతో కొత్తగా వచ్చిన సహకార శాఖ అధికారి రాష్ట్ర ఉన్నతాధికారులకు రికార్డులు ఇవ్వలేదని నివేదించా రు. దీనిపై సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తులను మొదలుపెట్టారు.

• కమీషన్‌పై ఆరా

జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం బదిలీ తర్వాత ఆయన ఆదిలాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. ఆయన అక్కడి డీసీసీబీలో ఓఎస్‌డీగా అక్కడ చేరారు. అయితే బదిలీకి ముందు జరిగిన కార్యకలాపాల వివరా లను ఇవ్వకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి సమాచారాన్ని సేకరిస్తున్నారు. సహకారశాఖ పరిధిలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధిం చి 2018 నుంచి 2023 వరకు ఎంత కమీషన్ సంఘాలకు చెల్లించారు.. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను కొత్త అధికారి తీయించారు. ఆ స్టేట్‌మెంట్‌ల ద్వారా ఏ శాఖకు ఎంత మొత్తం ఏ సీజన్‌లో చెల్లించారో వివరాలను తీసుకున్నారు. ధాన్యం కొనుగోలు కమీషన్ సహకార శాఖకు రాగానే వెంటనే కొనుగోలు చేసిన సంఘాలన్నింటికీ పంపించాల్సి ఉన్న ఇతర అవసరాలకు వాడటం బ్యాంకులో నిల్వ ఉంచడం, దానికి సంబంధించి న వడ్డీని కార్యాలయ అవసరాలకు వినియోగించినట్లు చూపెట్టడంతో అసలు సంఘాలకు చెల్లింపులు ఆలస్యంగా జరిగినట్లు ఉన్నతాధికారు లు గుర్తించారు. ప్రతీ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలతో పాటు వచ్చిన కమీషన్ వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు మెయింటె న్ చేయాలి. ప్రతీ సీజన్‌లో వచ్చిన డబ్బులకు సంబంధించి ఆడిటింగ్ చేయాలి. ఆడిటింగ్ నివేదికను కూడా ఉన్నతాధికారులకు పంపించాలి. ఈ ఐదేళ్లలో ఏవీ సక్రమంగా జరగనట్లు కొత్తగా వచ్చిన అధికారి గుర్తి ంచడంతోపాటు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది.

• చర్యలకు సిద్ధమవుతున్న ఉన్నతాధికారులు

సహకార సంఘాలలో జరిగిన వ్యవహారంపై సహకారశాఖ మంత్రి కూడా సీరియస్‌గా ఉండటంతో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్లలో వచ్చిన కమీషన్‌కు సంబంధి ంచి పూర్తిస్థాయిలో ఆడిటింగ్ చేపట్టి నష్టపోయిన సంఘాలకు చెల్లింపు లు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోళ్లకు సంబ ంధించి తనకు ఏ రిజిస్టర్లు అప్పచెప్పలేదని కొత్తగా వచ్చిన సహకారశా ఖ అధికారి తెలిపారు. అన్ని వివరాలను ఉన్నతా ధికారులకు నివేదించా నని వివరించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ వ్యవహారంపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఎన్నికల నిర్వహణలో..

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి23: ఎన్నికల నిర్వ హణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమీ కృత కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల సెక్టోరియల్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరియల్ అధికా రులు నిర్వహించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించా రు. ఎన్నికల సంఘం నియమనిబంధనలకు లోబడి నిర్వహించాల్సిన విధుల గురించి తెలియచేస్తూ రూపొందించిన హ్యాండ్‌బుక్కులను అధికారులకు అందజేశారు. క్షేత్రస్థాయిలో ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృ ష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. శిక్షణతరగతు ల్లో జిల్లాఉపఎన్నికల అధికారిణి కృష్ణవేణి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఏఆర్ఈవోలు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించారు..

లక్షణంగా వదిలేశారు!

- అటకెక్కిన చెత్తశుద్ధి • నిరుపయోగంగా గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్‌లు
- తడి, పొడి చెత్త వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కరువు • అధికారుల అలసత్వంతో నెరవేరని సర్కారు లక్ష్యం
- ప్రత్యేకాధికారుల పాలనలోనైనా అధికారుల తీరు మారేనా?!



పురాణిపేట్ గ్రామంలో నిరుపయోగంగా మారిన కంపోస్ట్ షెడ్డు

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి23: పల్లెల్లో పారిశద్యం పట్టాలు తప్పు తోంది. పల్లెలపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని, పలు అభివృద్ధి కార్య క్రమాలు చేపడుతున్నా ఫలితం కన్పించడం లేదు. పారిశుధ్య కార్య క్రమాలకు కొత్త ఆవిష్కరణలు చేస్తున్నా.. వాటిని ఆచరణలోకి తీ సుకరావడానికి ప్రభుత్వశాఖ అధికారులు కనీసం ప్రయత్నించడం లేదు. ప్రభుత్వం వెచ్చిస్తున్న కోట్ల రూపాయలు వృథా అవుతున్నా యి. ఇందులో గ్రామాల్లో నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగం గా ఉండడం, తడి, పొడి చెత్త వ్యర్థాలు ఎక్కడికక్కడే కన్పించడమే నిదర్శనమని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

• నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఒక్కో గ్రామ పంచాయతీలో షెడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు వెచ్చించిం ది. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మం చిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మా ణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వాల లక్ష్యం నెరవే రడం లేదు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు నిరుపయో గంగా దర్శనమిస్తున్నాయి. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగా హన లేకపోవడంతో గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్‌లో ఎటుప డితే అటు చెత్తను గుమ్మరిస్తున్నారు ప్రజలు. ట్రాక్టర్‌లో పడ్డ చెత్త వ్యర్థాలను కంపోస్ట్ షెడ్ దగ్గరకు తెచ్చి చెత్తను వేరుచేయాలి. అటువంటిది ఏమీ లేకుండానే గ్రామ పరిసరాల్లో దూరంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వద్దకు చెత్త ట్రాక్టర్‌ను తీసుకపో యి ఒక్క దగ్గర పేర్చి నిప్పుపెడుతున్నారు. అనేక మైన వ్యర్థాలు ఉండడంతో వెలువడుతున్న కాలుష్య వాయువులతో ప్రజలు రోగా లబారిన పడుతున్నారు.

• తయారుకాని ఎరువు.. వృథాగా నిర్మాణాలు

మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు నీళ్ల ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిచేందుకు బుట్టలను పంపిణీ చేసిం ది. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించలేకపోయారు. గ్రామా ల్లో ఎరువు చేస్తున్న దాఖలాల్లేవు. సేంద్రియఎరువు తయారు చేసేలా కంపోస్టు షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం అవి నిరుపయో గంగా పడివున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగు తోంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి సమక్షంలో పాలన కొనసాగు తుంది. గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, అంటురోగాలు రాకుండా జాగ్రత్తలు, ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించడం, తదితర అంశాలపై పనులు చేయాల్సి ఉంది. ప్రత్యేకాధికారుల పాలనలోనైనా కంపోస్ట్ షెడ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తారా లేదా అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.



ఖాళీగా దర్శనమిస్తున్న చెత్త గదులు

ప్రత్యేక అధికారులతో చర్చించి చర్యలు చేపడతాం

• సంతోష్ కుమార్, ఎంపీడీవో భీమ్‌గల్



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంపోస్ట్ షెడ్ నిరుపయోగంగా వున్నాయని ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త ను వేరుచేయాలి. వ్యర్థాలతో సంపదను సృష్టించాలి. గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులతో పాటు, పంచా యితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తాం.. పనిచేయని అధికారు లపై చర్యలు తీసుకుంటాం.



• బోధన్‌లోని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ

నేడు బోధన్‌కు మంత్రులు

- బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించనున్న కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు • ప్రభుత్వ నిర్ణయంతో చెరుకు రైతుల్లో పెరుగుతున్న ఆశలు



నిజామాబాద్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేబినె ట్ సబ్ కమిటీ సభ్యులు శనివారం బో ధన్‌కు రానున్నారు. కమిటీ చైర్మన్, రా ష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుగ్గిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసంహ, సభ్యులు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, మైనంపల్లి రోహి త్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోపాటు కమిటీలోని శాఖల అధికారులు షుగర్ ఫ్యాక్టరీని పరిశీలి ంచనున్నారు. మూతబడి ఉన్న ఫ్యాక్టరీ ఏ పరిస్థితుల్లో ఉంది.. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తక్షణం తీసుకోవాల్సిన చర్యలేమిటి అనే అంశాలను అధికారులతో సమీక్షించనున్నారు. షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు రాను ండటంతో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో అధి కారులు శుక్రవారం సాయంత్రం ఫ్యాక్టరీని పరిశీలించి ఏర్పాట్లు చేపట్టారు.

• ఎన్నికల హామీలో భాగంగా..

శాసనసభ సభ ఎన్నికల సమయంలో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను పరిశీలిస్తామని, వాటిని పునరుద్ధరించేందు కు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నేతలు ప్రకటించారు. శాసనసభ ఎన్నికల అనం తరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలోని పరి శ్రమలపై దృష్టిసారించారు. నిజాం ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన బోధన్ ముత్యంపేట, మెదక్‌లోని ఫ్యాక్టరీ లను పరిశీలించి నివేదిక అందించేందుకు కేబినెట్ సబ్ కమిటీని సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు. ఇద్దరు మంత్రులతోపాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రె డ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, జగిత్యాల నుంచి ఎ మ్మెల్సీ జీవన్‌రెడ్డికి చోటు కల్పించారు. వీరు అధ్యయనం చేయడంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని షుగర్ ఫ్యాక్టరీల ను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. ఈ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు ఫ్యాక్టరీల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకోనుంది. ఫ్యా క్టరీల పునరుద్ధరణకు అవసరమైన నిధులను సమకూర్చనుంది.

• చెరుకు రైతుల్లో పెరుగుతున్న ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను పునరుద్ధ రించేందుకు కేబినెట్ సబ్ కమిటీని నియమించడం వారు ఫ్యాక్టరీని పరిశీలించేందుకు నేడు బోధన్ వస్తుం డటంతో ఈ ప్రాంత చెరుకు రైతుల్లో ఆశలు పెరుగు తున్నాయి. బోధన్, ముత్యంపేట, మెదక్‌లో నిజాం నవా బ్ ఈ మూడు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. వారి హయాం నుంచి లాభాల బాటలో ఫ్యాక్టరీ నడవడంతో పాటు ఈ మూడు ఫ్యాక్టరీల పరిధిలో సుమారు 40వేల ఎకరాలకు పైగా చెరుకు సాగ య్యేది. నిజాం పాలన పోయి ఉమ్మ డి రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పరిశ్రమ కొనసాగింది. దాన్ని ఆధునీ కరించడం వల్ల ఆసియాలోనే పేరుగా ంచింది. తదనంతరం ఫ్యాక్టరీలో ఏర్ప డిన పరిణామాల ఆధారంగా టీడీపీ హయాంలో ప్రైవేట్ ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌కు మారింది. కొద్ది రోజు లు ఫ్యాక్టరీని నడిపిన యజమాన్యం 2015లో లేఆఫ్‌ను ప్రకటించారు. అప్పటినుంచి ఫ్యాక్టరీ మూతపడే ఉంది. ఫ్యాక్టరీపై ఆధారపడిన కార్మికులు రోడ్డున పడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ఫ్యాక్టరీపై ఎలాంటి చర్యలను తీసుకో లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వావత కమిటీని నియమించడంతో మళ్లీ తెరుస్తారనే ఆశలు, రైతులు, కార్మికుల్లో కన్పిస్తున్నాయి. ఫ్యాక్టరీ మూతపడ టంతో చెరుకుసాగు కూడా భారీగా తగ్గిపోయింది. జిల్లాలో ప్రస్తుతం 3వేల ఎకరాల లోపే సాగవుతుంది. చెరకు సాగు చేసిన రైతులు ఇతర పంటలపై వైపు మారారు. ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తే రైతులు సాగుకు మళ్లీ మొగ్గుచూపే అవకాశముంది షుగర్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌కు డిమాండ్ ఉండటంతోపాటు చెరుకు కూడా ధర కూడా వస్తుండటంతో సాగుచేసే రైతులకు లాభాలు వస్తున్నాయి. ప్రభుత్వం తీసుకునే చర్యల ఆధారంగా ఫ్యాక్టరీ పునరుద్ధరణ జరిగితే ఈ మూడు జిల్లాల పరిధిలో మళ్లీ చెరుకు సాగు పెరిగే అవకాశముంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిపేట, ఫిబ్రవరి 23: నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఎం అశోక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్ మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ కోరారు.

.. శివశ్రీనివాస కల్యాణం

ముప్కాల్, ఫిబ్రవరి23: ముప్కాల్ మండల కేంద్రంలోని దులగుట్టపై శివశ్రీనివాస కల్యాణ మల్లన్న జాతరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం శివశ్రీనివాస ఆలయ సన్నిధిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. 11మంది వేదపండితులు, మంత్రోచ్చారణతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలను యాజ్ఞ హోమన్ని నవగ్రహ పూజ, రుద్రభిషేకం, హోమం, ఉత్సవమూర్తులకు అలంకరణ, వేదంపడితుల నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'రైతు వ్యతిరేక విధానాలతోనే ఆత్మహత్యలు'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేకవిధానాల కారణంగానే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సీపీఐ (ఎంఎల్), ఏఐకేఎస్ నాయకులు అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఢిల్లీలో ఆందోళన కార్యక్రమాలు చేపడితే పోలీసులు జరిపిన కాల్పుల్లో యువ రైతు శుభకరణ్ సింగ్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆయనకు జోహార్లు పలికారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.దేవారాం, జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో కేంద్రప్రభుత్వం చేపడుతున్న రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 13 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడితే చర్చలు జరుపాల్సిన ప్రభుత్వం రైతులపై కాల్పులు జరిపించి రైతు ప్రాణాలు బలిగొందని ఆవేదన వ్యక్తంచేశారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేస్తూ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి కిషన్, నాయకులు సత్యనారాయణ, సత్తెమ్మ, బాలయ్య, మండల కార్యదర్శి బి.అశోక్, కిషన్, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి 23:విద్యార్థుల క్రమశిక్షణే వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతుందని ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం బోధన్‌పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. కళాశాల విద్యార్థులు సాంకేతిక రంగాలలో రాణించాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండటం వల్ల జీవితంలో అనుకున్నది సాధించి ముందడుగు వేయవచ్చన్నారు.వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ దుష్యంత్, కళాశాలల డైరెక్టర్ వి.సునీత,ఆనందరెడ్డి, ప్రసాద్, గంగాధర్, నరేందర్,అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ,ఇంటిగ్రేటెడ్ పరీక్షలకు
101మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 23:పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షలకు శుక్రవారం 1911 మంది విద్యార్థులకు గాను 1810 మంది హాజరయ్యారని, 101 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పీజీ పరీక్షలు తెలంగాణ వర్సిటీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలతో పాటు సౌత్‌క్యాంపస్, జీజీ కళాశాల, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ,ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జరుగుతాయని తెలిపారు.



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న మహిళలు

దుబ్బాకలో నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్పల్లి, ఫిబ్రవరి 23:మండలంలోని దుబ్బాక గ్రామ శివారులో గల నల్లగుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పల్లకీ సేవలో ఉత్సవ మూర్తులను గ్రామం నుంచి గుట్టపైకి శోభాయాత్రగా తీసుకెళ్లారు. శనివారం పుణ్యవచనం, కల్యాణం, బలిహరణం, అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. చివరి రోజైన ఆదివారంగ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. మూడు రోజుల పాటుజరిగే ఈబ్రహ్మోత్సవాలకు సిరికొండ, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, తండాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటారు. గుట్టపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తెలిపారు.

నేడు కమ్మర్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 23: కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం,రథోత్సవం, జాతర శనివారం జరుగుతుందని వీడీసీ అధ్యక్షుడు అంగరేకుల మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు గండికోట సాయిరాం, కార్యదర్శి అంకిత్ ,కోశాధికారి కుమ్మరి భూమేశ్వర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి యజ్ఞ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు. శనివారం ఉదయం గుట్టపైగల స్వామివారి ఆలయంలో బ్రహ్మంగారు,గోవిందమ్మల కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, మహాయజ్ఞం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. స్వామివారి కల్యాణం, జాతరా ఉత్సవాల సందర్భంగా గుట్టపై భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. ఉదయం స్వామివారి కల్యాణం, సాయంత్రం గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయనుంచి గుట్ట వరకు స్వామివారి రథోత్సవ ఊరేగింపు ఉంటోందని వీడీసీ అధ్యక్షుడు మల్లేష్, కమిటీ సభ్యులు తెలిపారు.

26న జరిగే నిరసనలో అధిక సంఖ్యలో పాల్గొనాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 23:ఢీల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా 26న చేపట్టిన నిరసన కార్యక్రమంలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాల్సింది ప్రభుత్వమే న్నారు. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం సరైందని కాదన్నారు. సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రంజిత్‌కుమార్, రాధకుమార్, ఆనంద్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేడు ఉపన్యాస పోటీలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 23: ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 8,9,10వ తరగతి విద్యార్థులకు శాస్త్రీయ దృక్పదం నేటి అవసరం అంశంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మారం(బి)లో శనివారం 11గంటలకు ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ కన్వీనర్ సాయన్న తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

108 వాహనాలను తనిఖీ చేసిన జిల్లా మేనేజర్

బాన్సువాడ, ఫిబ్రవరి 23: బాన్సువాడ డివిజన్ పరిధిలో గల 108, 102వాహనాలను శుక్రవారం ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ అంబులెన్స్‌ల పనితీరు, వాటి పరికరాలను పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలను అదించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిట్ అధికారి షేక్ ఫయిజ్, జిల్లా ఇంచార్జి లింగాచారి. 108 సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి మృతి

రామారెడ్డి,ఫిబ్రవరి 23: రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి లక్ష్మీపతి(55) చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ కొండా విజయ్ తెలిపారు. ఈనెల 21 న ఉదయం 9 గంటలకు తన సైకిల్‌పై బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. చుట్టుపక్కల వెతుకుతుండగా.. గురువారం రాత్రి మృతుడి వ్యవసాయభూమి రాజమ్మతండా దగ్గర తన వ్యవసాయ భూమిలో ఉన్నచెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిఉండడాన్ని గుర్తించామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఐదుగురికి జైలు

ఖిల్లా, ఫిబ్రవరి 23:నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాంగ్రా వద్ద పేకాట ఆడిన ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు నాల్గోటౌన్ ఎస్‌ఐ సంజీవ్ తెలిపారు. ఈనెల 13న పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం కోర్టు ఎదుట హాజరు పర్చగా కోర్టు వారికి జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

● మట్కా నిర్వాహకుడికి 4రోజుల జైలు

నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం కోర్టు ఎదుట హాజరుపర్చగా కోర్టు ఆయనకు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పోచారం ఉడత బెదిరింపులకు భయపడేది లేదు

● తనయుల నిర్వాహకంతో సైన్యం విచ్ఛిన్నం అవుతోంది ● బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి



కోటగిరిలో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్ రెడ్డి

కోటగిరి,ఫిబ్రవరి23: నియోజకవర్గ ప్రజలను, నాయకులను వంచించి 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఊడత బెదిరింపులకు ఎవరు భయపడేది లేదని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ సునీతతో సహ ఇద్దరు ఎంపీటీసీలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వందలాది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి వీరిందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారంతో పాటు ఆయన తనయులపై తీవ్రస్థాయిలో విరుకచుకుపడ్డారు. పోచారంతో సహ ఆయన కుటుంబాన్ని ప్రజలు ఎంతగానో ఆదరించినా.. వారి ఆశలు, ఆశయాలు నెరవేర్చలేదన్నారు. ఆయనతో పాటు తనయులు నియోజకవర్గాన్ని అన్ని విధాల దోచుకున్నారని ఆరోపించారు. తనను కొత్త బిచ్చగాడుగా పోచారం సమక్షంలోనే తనయులు సంబోధించిన నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ఏళ్ల తరబడి ప్రజలను మాయమాటలతో తన సైన్యంగా నిర్మించుకుని పోచారం రాజులా వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుతం ఆయన సైన్యం విచ్ఛిన్నం అవుతుందని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా తుడుచుకుపెట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వానికి మద్దతు ఇస్తుమంటూనే బాన్సువాడలో మూడు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుందని కార్యకర్తలకు పోచారం నచ్చజెప్పే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోచారం మాయమాటలను ఎవరు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీని ఇవ్వడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిదులు, నాయకులు కదిలి వస్తున్నారని వారి రాకతో పార్టీలో ఉన్న నాయకులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికి తగిన ప్రాధాన్యత కల్పించి పార్టీని బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, షహీద్, శంకర్, పవన్, చంద్రశేఖర్, అరుణ్ కుమార్, గంగాదర్ రావు దేశాయ్, శ్రీనివాస్ రావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ధర్నా



మున్సిపల్ కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి23: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య కాలనీవాసులు ధర్నా నిర్వహించారు.యానంగుట్ట సుందరయ్యకాలనీలో గత కొన్నేళ్లుగా నివాసముంటు న్నామని ప్రభుత్వం పట్టాలు జారీ చేసి నీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మున్సిపల్‌లో పలుమార్లు విన్నవించుకున్నామని అన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుతాడి ఎలయ్య, జవహర్‌సింగ్, సాయిలు, ఓంకార్,రఫీ, అమర్‌ఖాన్, సహీదబేగం, రజీయ, సన్వీన్, సమీర్, హస్రద్, పద్మ, వాసవి, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల నియామకం పట్ల హర్షం

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి23: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో 26మంది స్టాఫ్ నర్సుల నియామకం పట్ల బీజేపీ సీనియర్ నాయకులు కలిగోట గంగా ధర్, కేసీ ముత్తెన్నలు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత విషయంలో ప్రస్తావించడం జరిగిందని దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్ నర్సులను నియామించిందని, నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నందిపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నందిపేట,ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌కెఎం ఇచ్చిన పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఢిల్లీలో నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు శాంతియుతంగా ధర్నా, నిరసన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం వారిపై బాష్పావాయువు ప్రయోగించడం, లాఠీ చార్జీలు చేయడం ఏమి టిని ప్రశ్నించారు. లాఠీ చార్జీలో మృతి చెందిన రైతుకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, పోలీసులపై చట్టసరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె గంగాధర్, భైన మల్లయ్య, రాజలింగం తదితరులు ఉన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన



ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న శివరాం బంధువులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి23: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిచౌరస్తాలో గురువారం మెండోర మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి కాలుతో తన్నడంతో శివరాం మృతి చెందినట్టు బంధువులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం శివరాం బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. బంధువులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మామిడిపల్లిలో చౌరస్తాలో శివరాం డబ్బులను యాచిస్తూ కారుకు అడ్డుతలగడంతో కారులో ప్రయాణిస్తున్న మెండోర మండల కార్యాలయంలో పని చేస్తున్న ఆ ఉద్యోగి కోపంతో కారును ఆపి శివరాంను కాలుతో తన్నగా ఆ పక్కన వెళ్తున్న టిప్పర్ వెనుక టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో రవికుమార్‌ను అడగగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు.

నేడు సిర్పూర్‌లో అగ్గిమల్లన్న జాతర

డొంకేశ్వర్, ఫిబ్రవరి23: మండలంలోని సిర్పూర్ గ్రామంలో అగ్గి మల్లన్న ఆలయ జాతర బ్రహ్మోత్సవాలను 24వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు కొనసాగుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వమిస్తున్నామని, స్వామివారికి సల్లకుండల (బోనాలు) చుట్టు పక్కల గ్రామాల వందల సంఖ్యలో తరలివచ్చి భక్తులు అగ్గి మల్లన్న స్వామిని దర్శించుకుంటారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. జాతర ఉత్సవాలలో బాగంగా 24వ తేదీ స్వామి వారి ఊరేగింపు, కళ్యాణం, అన్నదానం, 25వ తేదీన అమ్మవారి బోనా లు, సలకుండలు, 26న నైవేద్యాలతో మొక్కులు తీర్చుకుంటారు. 27న స్వామి వారికి నైవేద్యాలు, 28న అగ్నిగుండం స్వామివారి నాగవెళ్ళి కార్యక్రమాలు జరగుతాయని.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకోవాలని వారు కోరారు.



సిర్పూర్‌లో విద్యుత్ దీపాలతో ముస్తాబైన అగ్గిమల్లన్న ఆలయం

ఎమ్మెల్యే లాస్యనందిత అంతక్రియల్లో జడ్పీ చైర్మన్



ఎమ్మెల్యే లాస్య నందిత అంత్రక్రియల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్

ఖిల్లా,ఫిబ్రవరి 23:రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్‌మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అంత్యక్రియల్లో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసం వద్ద శుక్రవారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. లాస్యనందిత తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న స్వగ్రామం మాక్లూర్ మండలం అల్వాపూర్ కావడంతో జడ్పీ చైర్మన్‌కు లాస్యనందిత కుటుంబంతో సాన్నిహిత్యం ఉంది. లాస్యనందిత మృతితో అల్వాపూర్‌లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. గతేడాది సాయన్న మృతి చెందగా.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాస్యనందిత కాంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలు కాకముందే ఆమె మృతిచెందడంతో అల్వాపూర్ గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో జడ్పీ చైర్మన్‌తో పాటు ఆయన తనయుడు దాదన్నగారి సందీప్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

●ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల సంతాపం ప్రకటించిన పోచారం

బాన్సువాడ: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల మాజీ శాసనసభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే సాయన్న మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఆమె మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు.

మూడు గంటల సమయంలో పలుమార్లు విద్యుత్ కట్

● విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలిన పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు
● విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమకొండ, ఫిబ్రవరి 23: దేవుడు వరమందించిన పూజారి కరుణించడం లేదన్న సామెత దోమకొండ మండల విద్యుత్ శాఖ అధికారులకు సరిపోతుందేమో అని మండలంలోని రైతులు చర్చించుకుంటున్నారు. ఒక వైపు సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ కోతలు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించిన ప్పటికీ.. అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. దోమకొండలో మండలంలో విద్యుత్ ఇష్టానుసారంగా విద్యుత్‌ను కట్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మూడు గంటల సమయంలోనే 10 సార్లకు పైగా విద్యుత్ కట్ చేశారు. దీంతో రైతులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అసలే భూగర్భజాలాలు అడుగంటిపోయి వరి పంటలకు నీరందక రైతులు పంటల వద్దే పడిగాపులు కాస్తున్నారు. విద్యుత్‌లో అంతరాయం అంటూ చాలా సార్లు విద్యుత్ బంద్ చేస్తున్నారు. విద్యుత్ ఎక్కువ సార్లు పోతూ.. వస్తుండటంతో బోరుమోటర్లు సైతం పాడవుతున్నాయి. రైతులు వాటి మరమ్మత్తులకు అదనంగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు.దోమకొండ, అంచనూర్, ముత్యంపేటతో పాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అల్లుకున్నాయి. అయినా కూడ వాటిని తొలగించకుండా టాన్స్‌ఫార్మర్‌ల వద్ద రిపైర్, లైన్‌లో రిపేర్, తీగలు తెగిపడిపోయినప్పుడు మాత్రమే అక్కడున్న కొమ్మలను తొలగించి విద్యుత్ సప్లయ్ ఇస్తున్నారు. వేసవికాలం రాకముందే అధికారులు, సిబ్బందితో కొమ్మలను తొలగించి విద్యుత్‌లో అంతరాయం కలుగకుండ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ ట్రిప్ అవ్వడం జరుగుతుంది. గతంలో మండల సర్వసభ్య సమావేశంలో సంబంధిత శాఖ అధికారిపై అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నిర్లక్ష్యంగా ఉండకుండ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించిన ఆయన ప్రవర్తన తీరు అంతే ఉందని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడీఈ కిరణ్ చైతన్య సైతం సంవత్సరం క్రితం దోమకొండ అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సిబ్బంది తీగల వద్ద నుంచే ప్రతి రోజు వెళ్తున్నా.. వాటిని చూసిచూడనట్లు ప్రవర్తించడం వారి పనితీరుకు నిదర్శనం.



బీబీపేట రోడ్డులో చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్ తీగలు

విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలి

వరి పంటకు నిరందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కరంట్ కట్ చేయకుండా చూడాలి. కరంట్ పోతు వస్తూ ఉండటంతో వరి పంటలో నీరు పారడం లేదు. ఇప్పటికే రైతులు కొంత వరకు వరి పంటను నీరందక వదిలిపెట్టారు. గొర్రెలు, మెకల మేతకు వాడుతున్నారు. ఉన్న పంటనైన ఎండిపోకుండా త్రీఫేజ్ కరంట్ ఉన్న సమయంలో నిరంతరం ఉండాలి. -దోర్నల లక్ష్మణ్, అంచనూర్

సంక్షిప్త సమాచారం

బీజేపీలో పలువురి చేరిక

పెద్దబజార్, ఫిబ్రవరి 23:బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ నేతృత్వంలో నగరంలోని పలు డివిజన్లకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో పని చేసేందుకు యువత ముందుకు వస్తున్నారన్నారు. మూడో సారి దేశంలో బీజేపీ ప్రభుత్వమే ఏర్పాడుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌కులాచారి, హరీష్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మెట్టు విజయ్, సుక్కమధు, వీరేందర్, బొబ్బిలి వేణు తదితరులు ఉన్నారు.

వైభవంగా రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సిరికొండ ఫిబ్రవరి 23 : శ్రీరాజేరాజేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరగింది. సిరికొండ మండలం రావుట్ల గ్రామ పరిధిలో గల శ్రీ గాడిమాకుల రాజరాజేశ్వర స్వామి రెండు రోజుల జాతర ప్రారంభమైంది. శుక్రవారం స్వామివారికి యజ్ఞం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు ఆలయ కమిటీ చేత బలిదానం చేశారు. సాయంత్రం భక్తుల ఆనందోత్సవాల మధ్య రథోత్సవ క్రతువుని నిర్వహించారు. భక్తుల కేరింతల మధ్య రథోత్సవం జరిగింది. జాతరకు వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్న సత్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం గ్రామస్థులంతా ఆలయం వద్దకు వచ్చి అన్న పూజలు చేసి అక్కడే భోజనాలు చేసుకుంటారు.

అలీసాగర్ నీరు అందడం పట్ల రైతుల హర్షం

నవీపేట,ఫిబ్రవరి23: మండలంలోని రాంపూర్, లక్ష్మి కిసాన్ ఫారం, ఫత్తేనగర్ గ్రామాలకు అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందడం పట్ల శుక్రవారం రైతులు హర్షం వ్యక్తం చేశారు. డీ50/5 ఉప కాలువ ద్వారా ఆయా గ్రామాలకు చెందిన చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ విషయాన్ని గురువారం నిజామాబాద్ నుండి నవీపేట మీదుగా రెంజల్ వెళ్తున్న బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని నవీపేట వద్ద ఆయా గ్రామాల రైతులు కలిసి పరిస్థితిని వివరించారు. రాంపూర్, లక్ష్మి కిసాన్ ఫారం, ఫత్తేనగర్ గ్రామాలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. దీంతో గురువారం రాత్రి నుండి ఆయకట్టుకు సాగునీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బ్రిడ్జి పనులు నాణ్యతతో నిర్మించాలి

దోమకొండ, ఫిబ్రవరి 23:మండలంలోని ముత్యంపేట నుంచి సిరిసిల్ల రోడ్డుకు వెళ్లే డబుల్‌రోడ్డు పనులను శుక్రవారం జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ పరిశీలించారు. రోడ్డు మార్గంలో నిర్మిస్తున్న బ్రిడ్జి ని ఆయన పరిశీలించారు. అర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పనులు వేగవంతం చేయాలన్నారు.దోమకొండ నుంచి గొట్టిముక్కుల మీదుగా బిక్కనూర్ వరకు మంజూరు ఉందని అట్టి రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని డీఈ తెలిపారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అశబోయిన శ్రీనివాస్, కదిరే గోపాల్‌రెడ్డి, నాగారపు రాంలు, ముత్తగారి ముత్యంగౌడ్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి

● తహసీల్దార్‌కు లబ్ధిదారుల వినతి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 23:మండలంలోని హసాకొత్తూర్ గ్రామ శివారులో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూపంపిణీలో లబ్ధిదారులకు 113 ఎకరాలు భూపంపిణీ జరిగిందని, కానీ ఆ వ్యవసాయభూములు సాగునీరు లేక వృథాగాపడిఉన్నాయని లబ్ధిదారులు శుక్రవారం కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఆ భూముల్లో వ్యవసాయం చేసుకోవడానికి సాగునీరందేలా చర్యలుతీసుకోవాలన్నారు. ఆ భూములకు పట్టాలు ఉన్నా ఇప్పటికీ పోడు జరుగలేదని అధికారులు ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు పోడు చేసి భూములకు ల్యాండ్ మార్క్‌లు చూపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అసైన్‌మెంట్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పాలెపు రాజేశ్వర్, నాయకులు పడాల మల్లేష్, లబ్ధిదారులు పాలెపు శారద, కనక సవిత, బండి లక్ష్మీ, పాలెపు రాధ, బాలాయి, ఆర్ఐ, సర్వేయర్ బాలకృష్ణ ఉన్నారు.

మద్నూర్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

మద్నూర్, ఫిబ్రవరి 23:మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.2023-24 బ్యాచ్ విద్యార్థులు గ్రూపు ఫోటో దిగి, మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, పాఠశాల, ఉపాధ్యా యులు, తోటి విద్యార్థులతో గత కొన్ని సంవత్సరాలుగా కలిసి మెలిసి ఉండి, పాఠశాలను వీడి పోతుండటం బాధగా ఉందని పదవ తరగతి విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలను ఎన్నటికి మరిచి పోలేమన్నారు. ప్రధానోపాధ్యాయులు మల్లేశం మాట్లాడుతూ 10వ తరగతిలో అత్య. దిక జీపీఏ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు.

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యా యులు రాజేందర్,సామలపట్టాభి, ఉపాధ్యాయులు సహిన్‌బేగం, సబియా సిద్దికి,సంగీత,షాహిన్, ఫాతిమా, నస్రీన్,విద్యార్థులు తదితరులున్నారు.

నేడు కొలిప్యాక్‌లో జాతర, రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి23: మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణోతసవాన్ని అంగరంగా వైభ వంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించగా భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఆలయ అర్చకులు దండల మోహన్‌శర్మ, ఆధ్వ ర్యంలో స్వామి వారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.అనంతరం లక్ష్మీ నర్సింహ స్వామికి భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం జాతర, సాయంత్రం రథోత్సవం జరగనుంది. ఆదివారం చక్రతీర్థం, సాయంత్రం నాగవెళ్లి కార్యక్రమం, సోమవారం డోల సేవ, ఉత్స వాలు జరుగు తాయని ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు తెలిపారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పూజరులు




తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు



తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు



తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం



తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం



చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌పీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

కన్నుల పండువగా సీతారాముల రథోత్సవం



హోమంలో కార్యక్రమంలో భక్తులు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి23:సీతారామచంద్ర స్వామిసప్తాహిక ధ్వజారోహణ తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘశుద్ధ పౌర్ణమి శుక్రవారం రాత్రి సీతారాముల రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈసందర్భంగా ఆలయ వేద పండితులు సుమిత్‌శర్మ దేశ్ పాండే ఆధ్వర్యంలో రథోత్సవానికి ముందు నిత్యహోమం, బలిహరణం, రథప్రతిష్ట, కార్యక్రమాలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి హాజరుకాగా.. ఆయనకు ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ జంగం శాంతయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సురా మాధురి, ఆసాది జితేందర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతా పూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, శాంసన్, కంచెట్టి గంగాధర్, డా.షాదుల్ల, సుదర్శన్, నర్సారెడ్డి, సుద్దులం సాయిరెడ్డి, సాంపల్లి నర్సయ్య, ఆలయ ధర్మకర్త రాందాస్, సొసైటీ మాజీ చైర్మన్ జైపాల్, ఎంపీటీసీ సభ్యురాలు మానస, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

● రామనామంతో మార్మోగిన ప్రధాన వీధులు

చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో రథోత్సవం పురస్కరించుకొని సీతారాముల విగ్రహాలను రథాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి ప్రధాన వీధులగుండా రథోత్సవం నిర్వహించారు. రామ నామమ వీధులు మార్మోగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.

● రామాలయ అభివృద్ధికి కృషి : రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి ఆలయ అభివృద్ధితో పాటు పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రూరల్ శాసన సభ్యుడు డా.రేకుల పల్లి భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. రథోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు దేవాలయ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు.

● నేడు వన విహారం

నేడు సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వన విహారం, జాతర, చక్ర తీర్థం కార్యక్రమాలను అంగడీ మాముళ్లలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు. జాతర కార్యక్రమానికి ఇప్పటికే దుకాణసముదాయాలు వెలిశాయి. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

● గిరిజనులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

మోపాల్:గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటోందని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు.శుక్రవారం మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఓఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ 285జయంతి స్వర్ణోత్సవాల సందర్భంగా భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న పోడుభూముల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. గిరిజనుల న్యాయమైన పోడుభూముల పట్టాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ద్వారా గిరిజనులకు సరైన న్యాయం జరుగుతోందని తెలిపారు. గిరిజనులు అటవీ ప్రాంతాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో గిరిజనులు



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలచారని అన్నారు. గిరిజనులకు ఉన్న ప్రధానమైన సమస్య ఫారెస్ట్ రెవెన్యూ అధికారుల మధ్య భూసమస్యలు ఎదుర్కొంటున్నారని.. ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. ఎంపీ అర్వింద్ రూరల్ నియోజకవర్గానికి ఈ ఐదేళ్ల కాలంలో ఎన్ని లక్షల నిధులు ఇచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు. ఓట్ల కోసం ఆ పార్టీ నాయకులు మతాన్ని వాడుకుంటున్నారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంచిప్పలో నిర్మిస్తున్న ప్రాజెక్టును పేరు మార్చి కమీషన్ల కోసం రీ డిజైన్ పేరుతో లక్షల రూపాయలు దండుకున్నారని విమర్శించారు. మంచిప్ప ప్రాజెక్టు పాత డిజైన్ ప్రకారమే పనులు పూర్తి చేస్తామని అన్నారు. రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్, తహసీల్దార్ రామేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నేతలు ముప్పాగంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, యాదగిరి, తారచంద్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, భోజన్న, గంగ ప్రసాద్, సతీష్‌రెడ్డి, ఆయాగ్రామాల గిరిజన పెద్దలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మండల గిరిజన భవనం కోసం అర ఎకరం భూమిని కేటాయించారు. ఆభూమిలో భోగ్‌బండార్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

బేకరీ షాప్ యజమానికి రెండు రోజుల జైలు

ఖిల్లా, ఫిబ్రవరి 23:నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో గల డ్రీమ్‌డిసెర్ట్ బేకరీ నడుపుతున్న యజమాని నవతేజయంత్‌కుమార్‌కు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ.ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బేకరీలో ప్రేమికుల కోసం ప్రత్యేకంగా క్యాబిన్ ఏర్పాటు చేసి గంటకు రూ.300లు వసూలు చేస్తున్నడాని, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతున్నాడని ఆరోపణల నేపధ్యంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట శుక్రవారం ఉదయం హాజరు పరిచినట్లు తెలిపారు. కోర్టు ఆయనకు రెండు రోజుల శిక్ష విధించినట్లు తెలిపారు.

నేడు నందిపేట, మాక్లూర్ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిపేట, ఫిబ్రవరి23: నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11కేవి సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ ఎం అశోక్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్ మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ కోరారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

● డీఈవో దుర్గాప్రసాద్



ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

పెర్కిట్,ఫిబ్రవరి23: పదవ తరగతి విద్యార్థులకు విదిగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆదర్శపాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డివిజన్‌లోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీఈవో దుర్గాప్రసాద్ పలు సూచనలు చేశారు.బడిబయట పిల్లలను గుర్తించి వారికి పని ప్రాంత పాఠశాలలు ఏర్పాటు చేయాలని సీగ్రేడ్ విద్యార్థులకు ఏ గ్రేడ్ వచ్చేలా కృషి చేయాలని విద్యార్థులకు మార్చి 1వ తేదీ నుంచి ప్రిఫైనల్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు లైబ్రరీ పీరెడ్‌లో కథల పుస్తకాలలు చదివించాలని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, ఆర్‌వీఎం సెక్టోరియల్ అధికారులు వనిత, శ్రీనివాస్,శ్రీధర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్, పాల్గొన్నారు

జిల్లా జైలును పర్యవేక్షించిన డీజీ సౌమ్యమిశ్రా

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 23:సారంగపూర్‌లోని జిల్లా జైలును అధికారులు శుక్రవారం పర్యవేక్షించారు. జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా, ఐజీ ఎన్.మురళిబాబు, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్‌లు తనిఖీచేశారు. మహిళా బ్యారెక్‌లలో మహిళా ఖైదీలతో ముచ్చటించారు. జైలులో వారికి కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. వారికున్న ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రింటింగ్‌ప్రెస్‌ను పరిశీలించి ఖైదీలు పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించారు. స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించి ఖైదీలతో తయారవుతున్న వస్తువులను చూశారు. జిల్లా కారాగారంలో ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, బోధనా తరగతులు, శిక్షణా నైపుణ్యం గురించి అధికారులకుజైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్‌కుమార్ వివరించారు. ఆవరణలోని నర్సరీలో పెంచుతున్న డ్రాగన్ ఫ్రూట్స్, పలు రకాల పూల మొక్కలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

60ఏళ్లు అధికారంలోకి ఉండి పసుపు బోర్డు ఎందుకు సాధించలేదు?

● నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి23: కాంగ్రెస్ పార్టీ 60ఏళ్ల అధికారంలో ఉండి పసుపుబోర్డు ఎందుకు సాధించలేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. శుక్రవారం ఆర్మూర్‌లో నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తాము పసుపుబోర్డు సాధించడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. అనాడు పసుపును స్పైసెస్ బోర్డులో వేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. నాలుగేళ్లలో పట్టుబట్టి పసుపుబోర్డు సాధించామని, పసుపు పంటకు గిట్టుబాటు ధర రావడంతో పసుపు రైతులు సంతోషంగా ఉన్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.వచ్చేయేడు పసుపు సాగు విస్తీర్ణం పెరిగిన ధర ఎక్కువగానే వస్తుందన్నారు. ఆర్మూర్‌కు ప్రత్యేకతగా ఉందని, ఆర్మూర్‌లో ఏది జరిగితే అది రాష్ట్రంలో జరుగుతుందన్నారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్‌లు గెలిస్తే ఆ ప్రభుత్వాలు ఏర్పడ్డయని, ప్రస్తుతం బీజేపీ గెలువడంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపడుతుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో బీజేపీకి 30వేల మెజారిటీ వచ్చిందని,ఈసారి మరింత ఎక్కువ మెజారిటీ వస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా లక్షన్నర ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ తెలంగాణలో తగ్గిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పసుపు పంటకు మంచి ధర వచ్చిందని ఇదీ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీ అర్వింద్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, జీవీ.నర్సింహరెడ్డి, పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, శివరాజ్‌కుమార్, యమద్రిబాస్కర్, రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

బోధన్ రూరల్: రానున్న ఎన్నికల్లో బిజేపికి ఓటు వేసి మోడీని గెలిపించి దేశాన్ని కాపాడాలని నిజామాబాద్ ఎంపి అర్వింద్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కొమరం భీం క్లస్టర్ రథయాత్రకు సంబంధించి బోదన్ నియోజకవర్గ స్థాయి బూత్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపి అరవింద్ హాజరై మాట్లాడారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నేటికి వాటిని అమలు చేయక కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలోకి రాగానే బోదన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని రైతులను నమ్మించి ఇప్పుడు కమిటీ వేశామని కమీటీ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తుందని చెప్పి రైతులను మోసం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 53 ఫ్యాక్టరీలను తెరిపించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వాటిని అమలు పరిచిందన్నారు. పని చేసిన వారికే పదవులు దక్కుతాయని పని చేయని వారికి పదవులు దక్కవని ఆయన అన్నారు. స్థానిక సంస్థల్లో పదవులు దక్కని వారు అధైర్య పడవద్దని, అందరు కలిసి కట్టుగా పార్టీ కోసం పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజేపి పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, బిజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, సీనియర్ నాయకులు టి. నిర్సింహా రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, రెంజల్ జడ్పీటిసి మేక విజయ, బోదన్ నియోజకవర్గ కన్వీనర్ కూరెళ్ళ శ్రీధర్, మండలాల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, ప్రవీణ్, మనోహర్, సరీన్, నాయకులు బర్దిపూర్ ప్రణయ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్